క్లుప్తంగా

శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపు నేడు



పూజలందుకున్న శ్రీకృష్ణుడు

పద్మనాభం: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా మండలంలోని మద్దిలో ఈ నెల ఆరో తేదీన నిలిపిన శ్రీకృష్ణుడి విగ్రహాన్ని శనివారం పలు గ్రామాల్లో ఊరేగించనున్నట్టు త్రైత సిద్ధాంత భగవద్గీత విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు తెలిపారు. మద్దిలో ఈ ఊరేగింపు ఒంటి గంటకు ప్రారంభమవుతుందని తెలియజేశారు. మద్ది, పద్మనాభం, కృష్ణాపురం గ్రామాల్లో ఊరేగించిన అనంతరం భీమిలి మండలం మజ్జివలసలో ఉన్న ఆనందాశ్రమానికి ఈ విగ్రహాన్ని చేరుస్తామని తెలియజేశారు.

నేడు ప్రజా వేదిక

పద్మనాభం: మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం ఉదయం పది గంటలకు ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 22 పంచాయతీల్లో 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 31 వరకు ఉపాధి హామీ పథకం, పంచాయతీ రాజ్ తదితర శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీల్లో గుర్తించిన వివరాలను ఈ ప్రజావేదికలో వెల్లడించనున్నట్టు పేర్కొన్నారు.

243 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

పద్మనాభం: ఆర్‌వీ పురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎస్‌వోఎస్ కుటుంబ బలోపేత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 243 మందికి వైద్య పరీక్షలతో పాటు రక్త పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. విశాఖపట్నం మెడి కవర్ ఆసుపత్రి వైద్యులు తరుణ్, దినేష్ రోగులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌వోఎస్ ఆర్గనైజింగ్ మేనేజర్ కె.దుర్గరాజు, కో-ఆర్డినేటర్ వి.సత్యనారాయణ, మెడికల్ క్యాంపు ఇన్‌చార్జి కిరణ్ కుమార్, చిట్టివలస జ్యూట్ మిల్ కాంగ్రెస్ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దల్లి అప్పలరెడ్డి పాల్గొన్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం



మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

మధురవాడ: పర్యావరణ హితంగా మట్టి గణపతి విగ్రహాలనే అంతా పూజించాలని బీజేపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర కోరారు. మధురవాడ మిథిలాపురి ఉడా కాలనీలో బీజేపీ ఆధ్వర్యంలో మా భూమి మన దేశం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇంటింటా మట్టి సేకరించి మొక్కలు నాటారు. శ్రీ బలరామ్ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాదరావు పటాన్నాయక్ మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు కొందరు పార్టీలో చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు బి. అనీల్ కుమార్, సురేంద్ర, నాయకులు అయ్యగారి కామేష్, కేశవ్ కాంత తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే మత్స్యకారులకు గుర్తింపు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- చిన నాగమయ్యపాలెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



చిననాగమయ్యపాలెంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

తగరపువలస: రాష్ట్రంలో మత్స్యకారులకు గుర్తింపు, గౌరవం ఇచ్చింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం పంచాయతీ చిననాగమయ్యపాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీకి రూ.14 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.6 కోట్ల అభివృద్ధి పథకాలు ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిందన్నారు. ఇప్పటి వరకు తనకు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలుస్తున్న మత్స్యకారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సంక్షేమ పథకాలు కొనసాగించేందుకు, మరింత అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని మత్స్యకారులను కోరారు. పొరపాటున టీడీపీ, జనసేన కూటమికి ఓటు వేస్తే సంక్షేమ పథకాలు నిలిచిపోవడంతో పాటు సచివాలయ వ్యవస్థ రద్దు చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా మత్స్యకారులు తమ పంచాయతీలో డ్రైనేజీలు, సామాజిక భవనాలు నిర్మించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు సత్తెమ్మ, బొడ్డు దుర్గారావు, తోట ఎల్లారావు, వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండలఅధ్యక్షుడు గాడు శ్రీను, మండల సచివాలయాల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు చెల్లూరి నగేష్, గాడు వెంకటనారాయణ, పొట్నూరు చంద్రశేఖర్, వెంపాడ సూరిబాబు, చిల్ల హరి, మండలశాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుతో ప్రజా శ్రేయస్సు



లబ్ధిదారులకు రూ.12.70 లక్షల చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా ప్రతి పంచాయతీలో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం భీమిలి మండలం అన్నవరం పంచాయతీలో దివీస్ లేబొరేటరీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ పాలకవర్గం, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిరోజూ ఒక పంచాయతీని సందర్శించి సమస్యలు తెలుసుకోవాలన్నారు. పంచాయతీలో 970 కుటుంబాలకు రూ.13 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.3 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. అన్నవరం పంచాయతీకి దివీస్ లేబొరేటరీ సామాజికసేవ ఎంత చేసినా ఇంకా రుణపడే ఉంటుందన్నారు. పంచాయతీకి తాగునీరు సమృద్ధిగా అందించడమే కాకుండా వ్యక్తిగత మరుగుదొడ్లు, ప్రతి ఇంటికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. పంచాయతీలో 254 కుటుంబాలకు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి దివీస్ అందించిన రూ.12.70 లక్షల చెక్కును అందిచారు. అంతేకాకుండా రూ.11 లక్షలతో నిర్మించిన మహిళా సామాజిక భవనం, రూ.6 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాళ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.వెంకటరమణ, పంచాయతీ అధ్యక్షుడు మేరుగు ఎల్లాజీ, వైస్ ఎంపీపీలు సరపతి దుర్గాలమ్మ, బోని బంగారునాయుడు, దాట్ల పెదబాబు, ఎలమంచిలి సూర్యనారాయణ, దంతులూరి వాసురాజు, గాడు వెంకటప్పడు, దివీస్ సీఎస్‌ఆర్ అధికారులు డి.సురేష్ కుమార్, నరసింహారావు, హరికృష్ణ పాల్గొన్నారు.

పైప్‌లైను పనులు ప్రారంభం

పద్మనాభం: మండలంలోని మద్ది పంచాయతీ తుని పాలంలో పైప్‌లైను నిర్మాణ పనులను ఎంపీపీ కంటుబోతు రాంబాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ తుని పాలం గ్రామానికి కొత్తగా మంచి నీటి పైపు లైను వేసేందుకు జలజీవన్ మిషన్ నిధులు రూ.8.20లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో పైపు లైను పనులు ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ పాల్గొన్నారు.


శ్రీవారికి ప్రత్యేక పూజలు



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శేషవస్త్రం, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకెళ్లి అభిషేకాలు నిర్వహించి, స్వామి వారికి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

ముగిసిన కుంభాభిషేక పూజలు



అమ్మవార్లకు మండప ఆరాధన



అమ్మవార్ల అభిషేకానికి కలశాలతో మహిళలు

తగరపువలస: చిట్టివలస గ్రామ సంరక్షణార్థం నిర్వహించిన కుంభాభిషేక పూజలు శుక్రవారం ముగిశాయి. గురు, శుక్రవారాలలో 9 మంది అర్చకులు అష్టోత్తర కలశ స్నాపన పూర్వక కుంభాభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి హోమం, రుద్రహోమం, మహా మృత్యుంజయ హోమాలు చేశారు. గ్రామదేవత పోలమ్మ, దుర్గాలమ్మలకు పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన మహిళలు 108 కలశాలతో అమ్మవార్లను అభిషేకించారు.

ఘనంగా ఇంజినీర్స్ డే



విద్యుత్ శాఖ జోన్-3 ఆఫీసులో నివాళి అర్పిస్తున్న ఈఈ శ్రీనివాసరావు తదితరులు



మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళులర్పిస్తున్న కళాశాల సిబ్బంది

ఆనందపురం : భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో భావి ఇంజినీర్లు నూతన ఆవిష్కరణలకు కృషి చేయాలని సాయిగణపతి ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ ఎం.వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం కళాశాలలో ఇంజినీర్స్‌డే ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు చాలా వరకు ఇంజినీరింగ్ వ్యవస్థపై ఆధారపడి ఉందన్నారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రదీప్‌వర్మ, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ మహేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మోక్షగుండంకు ఘన నివాళి

మధురవాడ: విద్యుత్ శాఖ మధురవాడ జోన్-3 కార్యాలయంలో ఇంజినీర్స్ డే సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి విద్యుత్ శాఖ విశాఖ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాంకేతిక రంగానికి ఆయన చేసిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఈఈలు ఏవీ అనీల్‌కుమార్, ఆర్.రమేష్, ఎస్.రామునాయుడు, ఎస్.అప్పన్నబాబు, జేఏవో టీవీ రమణమూర్తి, ఏఏవో బంగారు నాయుడు, ఏఈలు ఏవీఎస్ రామమూర్తి, సురేష్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలపై అపోహలు వద్దు

ఆర్డీవో భాస్కరరెడ్డి



వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో భాస్కరరెడ్డి

తగరపువలస: భీమిలి నియోజకవర్గ ఓటర్ల జాబితాలపై అపోహలు పెట్టుకోవద్దని ఆర్డీవో ఎస్.భాస్కర రెడ్డి నాయకులకు సూచించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన తన కార్యాలయంలో శుక్రవారం సమావేశమయ్యారు. ఇంటింటా ఓటరు జాబితాలపై సర్వే ఇటీవల విజయవంతంగా పూర్తయిందన్నారు. వీటిని త్వరలో ప్రదర్శిస్తామని, అప్పుడు ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చన్నారు. ఓటర్లకు దూరంగా ఉన్న పోలింగ్ బూత్‌ల స్థానంలో.. దగ్గరగా ఉన్నవి అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. శిథిలమైన బూత్‌లకు ప్రత్యామ్నాయంగా అన్ని వసతులు ఉన్న కొత్త బూత్‌లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. సమావేశంలో వివిధ రాజకీయపార్టీల నాయకులు పాల్గొన్నారు.

వర్షాకాలం.. అప్రమత్తత అవసరం



జీవీ అగ్రహారంలో పర్యటిస్తున్న జెడ్సీ బొడ్డేపల్లి రాము

కొమ్మాది: వర్షాలు పడుతున్న నేపథ్యంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము సూచించారు. జీవీఎంసీ 4వ వార్డు జీవీ అగ్రహారం, కొత్తవలస ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. తడిచెత్త, పొడిచెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణ వంటి విషయాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణలో శానిటరీ సిబ్బంది అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. స్థానిక సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మినాయుడు, శానిటరీ సూపర్‌వైజర్లు బడే అమ్మోరు, బాలాజీ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



పీఎం పాలెం ఆర్‌హెచ్ కాలనీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

పీఎం పాలెం: ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆరో వార్డులోని ఆర్‌హెచ్ కాలనీ 49వ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ సచివాలయం పరిలోని 1231 కుటుంబాలకు చెందిన 2501 మంది లబ్ధిదారులకు వివిధ అభివృద్ధి పథకాలకు కింద రూ.6.68 కోట్లు నగదు రూపంలో అందజేశామన్నారు.

రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు

పీఎం పాలెం ఆఖరు బస్టాపు సమీపంలోని మామిడి తోట పార్కుల అభివృద్ధి పనులకు ముత్తంశెట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ నిధులు రూ.1.92 కోట్లతో ఈ పనులు చేపడుతున్నామన్నారు. అనంతరం షుగర్ ఫ్యాక్టరీ లేఅవుట్‌లోని పార్కు అభివృద్ధికి 19.87 లక్షలు జీవీఎంసీ నిధులు మంజూరు చేయగా.. శంకుస్థాపన చేశారు. అనంతరం కొత్తగా ప్రభుత్వ పథకాలు మంజూరైన లబ్ధిదారులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యురాలు లక్ష్మీ ప్రియాంక, జెడ్సీ కనకమహాలక్ష్మి, రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, 6, 7 వార్డుల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దుర్గాలమ్మకు విశేష పూజలు



చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మధురవాడ: నిజ శ్రావణ మాసం అమావాస్య, తత్కాల భాద్రపద శుద్ధ పాడ్యమి శుక్రవారాన్ని పురస్కరించుకుని పలు ఆలయాల్లో నిర్వహించిన పూజలకు భక్తులు విశేషంగా తరలి వచ్చారు. చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో ఉదయం కుంకుమార్చన, పుష్పార్చన, సాయంత్రం అమ్మవారికి సుగంధ ద్రవ్య, పంచామృత జలాభిషేకాలు నిర్వహించారు. సాయిప్రియ గార్డెన్ వాసులు మహేష్ కుటుంబ సభ్యుల సహకారంతో ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధర్మకర్త పిల్లా చంద్రశేఖర్, కమిటీ ప్రతినిధులు పిల్లా సూరిబాబు, పీవీజీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

– టైలర్స్ కాలనీ విజయదుర్గా దేవి ఆలయంలో అర్చకులు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో పూజలు, హోమం నిర్వహించారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



తాటితూరు జెడ్పీ హైస్కూల్‌లో బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

తగరపువలస: జాతీయభాష హిందీ పక్షోత్సవాలలో భాగంగా శుక్రవారం భీమిలి మండలం తాటితూరు, లక్ష్మీపురం జెడ్పీ హైస్కూళ్లలో విద్యార్థులకు హిందీలో వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్, టీఎల్‌ఎం చార్ట్‌లు, రైమ్స్, పాటలు, డాన్సులు, హ్యాండ్ రైటింగ్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు హిందీ భాష ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. ప్రపంచంలో హిందీ మాట్లాడేవారి సంఖ్య రెండో స్థానంలో ఉందన్నారు. రేడియో, టీవీలలో శుద్ధ హిందీ భాషను వినవచ్చన్నారు. మహాత్మాగాంధీ కూడా హిందీలోనే మాట్లాడేవారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసరావు, గాడు పైడిరాజు, హిందీ ఉపాధ్యాయులు టి.ఎస్.వి. ప్రసాదరావు, ఎం.లక్ష్మిణి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష సర్వే

ఆనందపురం : ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా శుక్రవారం వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. ఆరోగ్యశ్రీ లబ్ధిదారుల వివరాలతో పాటు వారి అనారోగ్య వివరాలను అప్‌లోడ్ చేశారు. శనివారం ఇంటింటికీ వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారి పూర్తి వివరాలను సేకరిస్తారు. ఈ నెల 30 నుంచి జరిగే వైద్య శిబిరంలో వారికి చికిత్సలు చేస్తారు. ఈ మేరకు ప్రతి ఇంటికీ ఒక కేస్ షీట్‌ను రూపొందిస్తారు.

ఈ-పంట నమోదుకు గడువు 20

పద్మనాభం: రైతులు ఈ-పంటను ఈ నెల 20వ తేదీలోగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంపీఎస్ చలం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 6,255 ఎకరాల్లో వరి నాట్లు వేయగా.. 3855 ఎకరాలకు మాత్రమే రైతులు ఈ-క్రాపు చేయించుకున్నారని తెలిపారు. మిగతా విస్తీర్ణానికి సంబంధించి రైతులు ఆర్‌బీకేకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన కోరారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న సర్పంచ్ చందక లక్ష్మి తదితరులు



షార్ట్‌పుట్ విసురుతున్న అండర్-17 విద్యార్థి



లాంగ్ జంప్‌లో అండర్-14 విద్యార్థిని

ఆనందపురం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆనందపురం ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన మండల స్థాయి ఆటల పోటీలు శుక్రవారంతో ముగిశాయి. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 240 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

విజేతలు వీరే..

అండర్-14 విభాగం కబడ్డీ పోటీల్లో శొంఠ్యాం ఉన్నత పాఠశాల జట్టు విన్నర్‌గా, గొట్టిపల్లి జట్టు రన్నర్‌గా నిలిచాయి. ఖోఖో పోటీల్లో శిర్లపాలెం జట్టు విన్నర్‌గా శొంఠ్యాం జట్టు రన్నర్‌గా.. త్రోబాల్ పోటీలలో వెల్లంకి జట్టు విన్నర్‌గా, రామవరం జట్టు రన్నర్‌గా నిలిచాయి.

– అండర్-17 విభాగంలో కబడ్డీ పోటీల్లో గొట్టిపల్లి జట్టు ప్రథమ స్థానాన్ని, ఆనందపురం జట్టు ద్వితీయ స్థానాన్ని గెలుచుకున్నాయి. ఖోఖో పోటీల్లో శిర్లపాలెం జట్టు ప్రథమ స్థానంలో, శొంఠ్యాం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. త్రోబాల్ పోటీల్లో బోయిపాలెం జట్టు విన్నర్‌గా, గిడిజాల జట్టు రన్నర్‌గా నిలిచాయి. అండర్-17 టెన్నీకాయిట్ పోటీలలో రామవరం జట్టు విజేతగా, వెల్లంకి జట్టు రన్నర్‌గా, బాల్ బాడ్మింటన్ పోటీలలో ఆనందపురం జట్టు విన్నర్‌గా, శొంఠ్యాం జట్టు రన్నర్‌గా నిలిచాయి. వాలీబాల్‌లో శిర్లపాలెం జట్టు, వెల్లంకి జట్టు మొదటి రెండు స్థానాలు గెలుచుకున్నాయి. విజేతలకు మెమెంటోలు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు, సర్పంచ్ చందక లక్ష్మి, మండల వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, పాఠశాల కమిటీ చైర్మన్ చందక అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు కె.రమాదేవి, బి.అప్పలస్వామి, ఉప సర్పంచ్ రమణమ్మ, నాయకులు చందక సూరిబాబు, ఉప్పాడ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో..

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో మూడు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి ఆటల పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ నెల 13న అండర్-14, 17 బాలికలకు, 14న బాలురకు కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, వాలీబాల్, టెన్నీకాయిట్, బ్యాడ్మింటన్, యోగా తదితర పోటీలు నిర్వహించారు. చివరి రోజైన శుక్రవారం అథ్లెటిక్స్‌లో భాగంగా ఈ రెండు విభాగాలలోని బాల బాలికలకు వేర్వేరుగా 100, 200, 400, 600, 800, 1500 మీటర్లు, 3 వేల మీటర్లు, 5 వేల మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్, హై జంప్, షార్ట్‌పుట్, డిస్క్ త్రో, జావెలిన్ పోటీలు నిర్వహించారు. మొత్తం 30 పాఠశాలల నుంచి 300 మంది విద్యార్థులు హాజరైనట్టు స్కూల్ గేమ్స్ మండల ఇన్‌చార్జి చిల్ల వెంకటరెడ్డి తెలిపారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మధురవాడ: మున్సిపల్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ ఏపీ మున్సిపల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల యూనియన్ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎంవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. మధురవాడ జీవీఎంసీ జోన్-2 కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. సమ్మె సమయంలో జీవీఎంసీ కమిషనర్ ఇచ్చిన హామీలను అమలు చేయని పక్షంలో ఈ నెల 16 నుంచి సమ్మెలోకి వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. సమ్మెలో భాగంగా శనివారం డీఆర్‌ఎం కార్యాలయం నుంచి జీవీఎంసీ వరకు ర్యాలీ కూడా నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే జీవీఎంసీ కమిషనర్, నగర మేయర్లకు సమ్మె నోటీసులు ఇచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సీహెచ్ శేషుబాబు, ఎస్.రాములప్పడు పాల్గొన్నారు.

చేనేత సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం



చేనేత ఎక్స్ ఫో స్టాల్స్ ప్రారంభిస్తున్న 6 వ వార్డు కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక

పీఎం పాలెం: శిల్పారామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జాతీయ చేనేత సిల్క్ ఎక్స్‌పోను జీవీఎంసీ ఆరో వార్డు కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేనేత వస్త్ర ఉత్పత్తుల విక్రయ స్టాళ్లు అక్టోబర్ 4వ తేదీ వరకూ అందుబాటులో ఉంటాయన్నారు. స్టాళ్లలోని వస్త్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, స్థానిక ఏవో విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.